సాక్షి మహబూబ్‌నగర్

శనివారం । 13 । మే । 2023



గచ్చుబావికి పూర్వవైభవం..

జడ్చర్లలోని కావేరమ్మపేట గచ్చుబావి పూర్వవైభవానికి నోచుకోలేకపోతోంది.

వివరాలు IIలో ▸



పండుగలకు ప్రాధాన్యత

మన సంస్కృతి, పండుగలకు ప్రాధాన్యత పెరిగిందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు.

వివరాలు IIIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.2 /26.7

మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు అమృత మహోత్సవాల సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని వీవీ కన్వెన్షన్‌లో శనివారం సాయంత్రం 5.30 గంటలకు నైజాం విముక్త స్వాతంత్ర్య అమృత మహోత్సవాల సందర్భంగా ప్రతిష్టత వ్యక్తుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి జిల్లా అధ్యక్షులు నాగేంద్రరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానవక్తగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వంశీతిలక్, ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్.కుమారస్వామి పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో ధార్మిక సంస్థల ప్రతినిధులు, కుల సంఘాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

న్యాక్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఈ సంవత్సరం న్యాక్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని డిగ్రీ కళాశాలల జాయింట్ డైరెక్టర్ యాదగిరి పేర్కొన్నారు. ఈ మేరకు కళాశాలలో అధ్యాపకులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాలకు అక్రిడేషన్ రావడం వల్ల అనేక రకాల లాభాలు ఉన్నాయని, అందుకోసం మంచి ప్రణాళికతో ముందకు వెళ్తే అనుకున్నదాని కంటే మంచి గ్రేడింగ్ వస్తుందని, అధ్యాపకులు టీం వర్క్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ శివలీల, విజయ్‌కుమార్, న్యాక్ కోఆర్డినేటర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎంసెట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఎంసెట్ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. జేపీఎన్‌సీ పరీక్ష కేంద్రంలోని 410 మందికి 399 మంది హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో 270 మందికి 262 మంది హాజరయ్యారు.

గ్రేవ్ కేసులపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లావ్యాప్తంగా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల విచారణ త్వరగా పూర్తి చేయాలని ఎస్పీ కె.నరసింహ ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం నేరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసుల విచారణలో నాణ్యత, పారదర్శకత ఉండాలని ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలు (బ్లాక్‌స్పాట్స్) గుర్తించి ప్రమాదాలు తగ్గించడానికి చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండే ప్రతి గ్రామాన్ని సందర్శించి, సర్పంచ్‌లు, పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు అమర్చుకునే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. దీంతో పాటు సైబర్ నేరాలు, ఎంవీఐ యాక్ట్ ఇతర అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంచాలన్నారు. అనంతరం గత నెలలో జిల్లాలో వివిధ బందోబస్తులలో జిల్లా పోలీసులు శాంతియుతంగా జరిపినందుకు డీజీపీ అంజనీకుమార్ జిల్లా ఎస్పీ కె.నరసింహకు ప్రశంసాపత్రాన్ని అందజేయ గా దానిని ఎస్పీ అందరితో పంచుకున్నారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఎస్పీ రివార్డులు అందించారు. ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీలు టి.మహేష్, లక్ష్మణ్, మధు, రమణారెడ్డి, రామారావు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్– 2,3 వారికి ఫౌండేషన్ కోర్సు ఐదు నెలల పాటు ఉచితంగా ఇస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆసక్తి గల వారు ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి హాస్టల్, భోజన వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

సోనా @ రూ.2,089

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,089, కనిష్టంగా రూ.1,609గా ధరలు నమోదయ్యాయి. హంస ధాన్యం ధర గరిష్టంగా రూ.1,449గా ధర లభించింది. మార్కెట్‌కు 100 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

ప్రారంభానికి ముందే.. సన్నాహాలు



జిల్లాకేంద్రంలోని గోడౌన్‌కు చేరిన పుస్తకాలు

- జిల్లాకు చేరిన పాఠ్య పుస్తకాలు, యూనిఫాం వస్త్రం
- బడులు తెరిచే నాటికి విద్యార్థులకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశం
- ఇప్పటికే మండలాలకు యూనిఫాం వస్త్రం అందజేత
- త్వరలోనే పాఠశాలలకు పుస్తకాల సరఫరా
- ఈ ఏడాది నోట్‌బుక్స్ సైతం పంపిణీకి చర్యలు?

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రతి సంవత్సరం పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం మే నెల చివరన జిల్లాలకు పంపిణీ చేసి జూన్, జూలై, ఆగస్టు వరకు కూడా పంపిణీ చేసేది. కానీ, ఈ సంవత్సరం మే మొదటి వారం నుంచే ప్రభుత్వం జిల్లాలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడం ప్రారంభించింది. ఇప్పటికే దాదాపు 45 శాతం వరకు పుస్తకాలు జిల్లా పుస్తకాల గోడౌన్‌కు చేరాయి. ఈ పుస్తకాలను ఎమ్మార్సీలకు తరలించిన వెంటనే మిగిలిన పుస్తకాలను జిల్లాకు చేరే అవకాశం ఉంది. మొదట కేజీబీవీలు, గురుకులాలకు పంపిణీ చేశాక సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలకు ఇవ్వనున్నారు.

పాఠశాలల విద్యార్థులకు సైతం..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నోట్‌బుక్స్ పంపిణీ చేసే యోచనలో ఉంది. ఇప్పటికే కేజీబీవీలు, గురుకులాలు, పాఠశాల స్థాయి ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు, గురుకులాల్లో చదువుతున్న వారికి ప్రభుత్వమే నోటుబుక్స్ అందిస్తుంది. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికి సైతం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. అయితే జిల్లాలోని 852 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాదాపు 6 లక్షలకు పైగా నోట్‌బుక్స్ అవసరమవుతాయని అంచనా.

ఎస్‌ఎంసీల నిర్ణయమే..

వచ్చేనెలలో పాఠశాలలు తెరిచే నాటికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు ఇవ్వాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి యూనిఫాంకు కావాల్సిన 3,86,623.95 మీటర్ల వస్త్రం అన్ని మండల కేంద్రాలకు ప్రభుత్వం గత నెల చివరి నాటికి పంపిణీ చేసింది. అయితే దుస్తులు కుట్టేందుకు పాఠశాలల ఎస్‌ఎంసీల నిర్ణయం మేరకు స్థానికంగా ఉండే టైలర్లు, మహిళా సంఘాల వారికి ఉపాధి కోసం ఇవ్వాల్సి ఉంది. కానీ, గతేడాది జిల్లా అధికారులు నేరుగా ఎలాంటి టెండర్ లేకుండా కొంతమంది బడా టైలర్లకు కట్టబెట్టారు. మరి ఈ సంవత్సరం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియాల్సి ఉంది. అయితే తక్కువ సమయం ఉండటంతో యూనిఫాంల పంపిణీ కష్టమే అన్న వాదనలు వినిపిస్తున్నాయి.



జడ్చర్లకు వచ్చిన యూనిఫాం వస్త్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ తదితరులు (ఫైల్)

మొత్తం పుస్తకాలు	6,82,924	
ఇప్పటికీ వచ్చినవి	2.88 లక్షలు	
ఇంకా రావాల్సినవి	3.49 లక్షలు	
ప్రభుత్వ పాఠశాలలు	852	
మొత్తం విద్యార్థులు	75,922	
యూనిఫాంకు కావాల్సిన వస్త్రం	3,86,623.95 మీటర్లు	
గురుకులాలు	కేజీబీవీలు	యూఆర్ఎస్
27	14	1
విద్యార్థులు	6,900	

పుస్తకాలు వచ్చాయి..

జిల్లాకేంద్రంలోని బుక్ డిపోకు 2.88 లక్షల పుస్తకాలు వచ్చాయి. మరిన్ని పుస్తకాలు రావాల్సి ఉంది. ఈసారి పాఠశాలల ప్రారంభం నాటికే పుస్తకాలను పంపిణీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లా అధికారుల నుంచి సూచనలు వచ్చిన వెంటనే వీలైనంత త్వరగా పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతాం.

– శ్రీనివాసులు, మేనేజర్, జిల్లా బుక్ డిపో

అభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దాం



భూమి పూజ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రవినాయక్, టీజీఓ అధ్యక్షుడు రాజగోపాల్

- తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా టీజీఓ ఏర్పాటు
- రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర సాధన కోసం ఉద్యోగులను ఏకం చేసేందుకు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో నిర్మించనున్న జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సంఘంలోకి రావడానికి అప్పుడు అధికారులు భయపడ్డారని తెలిపారు. ఉద్యోగులందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లాను ఊహించని స్థాయికి తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. పీఆర్‌సీ తెచ్చుకోవడంలో, 40వేల మందికి ప్రమోషన్ ఇప్పించడంలో టీజీఓ పాత్ర ఎంతో ఉందన్నారు. రాష్ట్రంలో అతి ఎక్కువ జీతాలు ఇస్తున్న రాష్ట్రంగా, ఎక్కువ పథకాలు అమలు చేస్తున్న చేస్తుంది తెలంగాణ అని మంత్రి అన్నారు. సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరించుకుంటూ వెళ్తామని చెప్పారు. జిల్లాలో జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు వచ్చేలా పథకాలు అమలు చేస్తున్నామని, కేసీఆర్ ఎకో పార్కుతో పాటు, 26 వేల ఎకరాలలో జంగిల్ సఫారీ, ఐటీ పార్కులో అతిపెద్ద ఎనర్జీ పార్క్ ఏర్పాటు, పాత కలెక్టరేట్ స్థానంలో మల్టీప్లెక్స్ సినిమా థియేటర్, వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, అధునాతన హంగులతో స్టేడియం నిర్మాణం, జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించే విధంగా తీర్చిదిద్దడం, ఇలాంటివన్నీ చేస్తున్నామని, జిల్లాను మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సంఘం భవనానికి రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించడంతో పాటు, 3, 4 అంతస్తులతో భవనాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మించాలని, భవిష్యత్‌లో టీజీవో సభ్యుల చిన్న ఫంక్షన్లు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు చేసుకునేలా నిర్మాణం ఉండాలని ఆయన సూచించారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు, వారి ఇబ్బందులు చర్చించుకునేందుకు ఒక భవనం అవసరమన్నారు. బయటి నుంచి వచ్చిన ఉద్యోగులకు జిల్లా కేంద్రంలో వసతి పాటు, ఇతర సౌకర్యం కోసం రూ.3 కోట్లతో టీజీవో భవనాన్ని నిర్మిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ చెప్పడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ నరసింహులు, టీజీఓ జిల్లా కార్యదర్శి బక్కశ్రీనివాస్, వెంకన్న, రాజీవ్‌రెడ్డి, కిష్టన్న, నరేందర్, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభను వెలికితీయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్, డీఎస్‌డీఓ శ్రీనివాసులు, తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడాపోటీలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. పోటీల నిర్వహణ విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు ఉంటాయని, గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయాలన్నారు. రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సచివాలయం ప్రారంభం రోజునే మొట్టమొదటి ఫైల్ సీఎం కప్ క్రీడల పైనే సంతకం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మండల స్థాయిలో 15 నుంచి 17 వరకు, జిల్లా స్థాయిలో 22 నుంచి 24 వరకు పోటీలను నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాలలో ఉంటాయని, జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రాతినిథ్యం వహిస్తున్నందున జిల్లా, మండల స్థాయి అధికారులు అందరూ ఈ పోటీల నిర్వహణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలం నుంచి అథ్లెటిక్స్‌లో 10, వాలీబాల్ 22, ఖోఖో 26, కబడ్డీ 22, ఫుట్ బాల్ 17, మొత్తం 97 మంది క్రీడాకారులు జిల్లా స్థాయికి పంపించాలని చెప్పారు. ఎంపీడీవోలు, ఇతర అధికారులు వారి విధులకు ఆటంకం లేకుండా పోటీలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ శ్రీనివాసులు, ఆర్ఐ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, డీఈఓ రవీందర్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ బాబురావు, అధికారులు పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదు

- ఆటో డ్రైవర్లు అసంఘటితరంగా కార్మికులుగా నమోదు చేసుకోవాలి
- సీనియర్ సివిల్ న్యాయమూర్తి సంధ్యారాణి



మాట్లాడుతున్న న్యాయమూర్తి సంధ్యారాణి

పాలమూరు: రోడ్లపై వాహనదారులు ఎలాంటి పరిస్థితుల్లో మద్యం తాగి వాహనాలు నడపరాదని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యరాణి అన్నారు. రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో శుక్రవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలకు గురి కావొద్దని సూచించారు. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం వాహనాల డ్రైవర్లు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. వాహనదారులు మద్యంలో వాహనాలు నడపటం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టంతో పాటు ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఇటీవల ఇలాంటి కేసులే ఎక్కువగా నమోదవుతున్నాయని, మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదన్నారు. ఆటోలు, ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లు లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ ఇతర పత్రాలు తప్పక ఉండాలన్నారు. ఆటోడ్రైవర్లు అసంఘటితరంగా కార్మికులుగా నమోదు చేసుకోవాలని, తద్వారా అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ఎంతో ఆసరా ఉంటుందన్నారు. డ్రైవర్లు వాహనాలు నడిపే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాల నివారణలో బాధ్యతగా ఉండాలని సూచించారు. అనంతరం ఈ–శ్రమ్‌లో నమోదైన ఆటో డ్రైవర్లకు కార్మికశాఖ ఆధ్వర్యంలో కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీసీ దుర్గాప్రమీల, డిప్యూటీ లేబర్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ యాదయ్య, లేబర్ ఆఫీసర్ అల్తాఫ్, జగపతిరావు, కార్తీక్, రాజేష్, పి.యాదయ్య పాల్గొన్నారు.

50 సబ్‌సెంటర్లకు శాశ్వత భవనాలు

- ఒక్కో భవనం రూ.20 లక్షల వ్యయంతో 300 గజాల స్థలంలో నిర్మాణం

పాలమూరు: గ్రామస్థాయిలో వైద్యసేవలు మరింత పటిష్టం చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్ సెంటర్లను బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు కొత్తగా 50 సబ్‌సెంటర్ భవనాలు మంజూరు చేశారు. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పని చేస్తున్న సబ్‌సెంటర్లు(వెల్‌నెస్ సెంటర్లు) శాశ్వత భవనాలు నిర్మించడానికి కార్యాచరణ సిద్ధమైంది. వీటి నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా కొత్తగా 50 చోట్ల నూతన శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. నూతన భవనాల నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. ఒక్కో సబ్‌సెంటర్ భవనం రూ.20 లక్షల వ్యయంతో 300 గజాల స్థలంలో నిర్మించాలని ప్రణాళిక తయారు చేశారు. ఇప్పటికే చాలా భవనాలకు స్థల సేకరణ పూర్తి చేశారు. మిగిలినచోట్ల కూడా వెంటనే స్థల సేకరణ చేసి భవన నిర్మాణ పనులు ప్రారంభం చేయాలని తహసీల్దార్లతో పాటు పంచాయతీరాజ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా భవనాలు బాలానగర్ పీహెచ్‌సీ పరిధిలో 4, రాజాపూర్ 2, నవాబుపేట 3, గంగాపూర్ 11, మిడ్జిల్ 4, జానంపేట 6, భూత్పూర్ 6, మణికొండ 2, కొత్తాబాద్ 2, చిన్నచింతకుంట 4, పేరూర్ 3, అడ్డాకుల, దేవరకద్ర, మహమ్మదాబాద్‌లో ఒక్కో సబ్‌సెంటర్‌ను నిర్మించనున్నారు.

నేడు 'ఓపెన్' ఇంటర్ ఎకనామిక్స్ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈ నెల 5న వాయిదా వేసిన ఓపెన్ స్కూల్ ఇంటర్ ఎకనామిక్స్ తెలుగు మీడియం పరీక్షను శనివారం నిర్వహిస్తున్నట్లు డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు పరీక్షల నిర్వాహకులు, విద్యార్థులు గమనించాలని సూచించారు. అలాగే శుక్రవారం నుంచి ఓపెన్ స్కూల్ పేపర్ వ్యాలువేషన్ క్యాంపు జిల్లాకేంద్రంలోని మోడల్ బేసిక్ పాఠశాలలో ప్రారంభమైందని.. వ్యాలువేషన్‌కు హాజరు కానివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'పీయూ కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి'

మహబూబ్‌నగర్ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ వారు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ మేరకు పలువురు అధ్యాపకలు మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రారంభం నుంచి పనిచేస్తున్నామని, తమ సమస్యను గుర్తించి ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో అధ్యాపకులు భూమయ్య, విజయ్‌భాస్కర్, సురేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టకు గండికొట్టారు!

- వెంచర్‌కు అడ్డంకిగా మారిందని 'రియల్' వ్యాపారుల నిర్వాకం
- చేతికి వచ్చిన వరి పంటలకు తీవ్ర నష్టం

జడ్చర్ల: తమ వెంచర్‌కు అడ్డంకిగా వస్తుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు కట్టను గండికొట్టిన సంఘటన జడ్చర్ల మండలంలోని బూరెడ్డిపల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం మేరకు.. గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఉన్న మురుగునవాని కుంట పక్కన ఓ భారీ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. సమీపంలోని మూరుగువాని కుంట అడ్డుగా మారిందని గతంలో ఓసారి ధ్వంసం చేసి తదుపరి అధికారులు, రైతులు స్పందించడంతో యథావిధిగా నిర్మించారు. ఇటీవల వెంచర్ నిర్వాహకులు కుంట తూమును మూసివేయడంతో చెరువులోకి వృథాగా వచ్చే మిషన్ భగీరథ నీటితో కుంట పూర్తిస్థాయిలో నిండిపోయింది. దీంతో తమ వెంచర్‌లోని ప్లాట్లు మునిగిపోతాయని భావించిన నిర్వాహకులు హిటాచీతో చెరువు కట్టను గండికొట్టారు. దీంతో నీరు పెద్ద ఎత్తున ఒకేసారి రైతుల పొలాల్లో వరి పంటను ముంచేసింది. చేతికి అందివచ్చిన వరి పంట నీట మునిగిందని రైతులు కృష్ణయ్య, నర్సింహులు గౌడ్, గోవిందు, వెంకటేష్, రాజశేఖర్ వాపోయారు. చెరువులో పెద్ద ఎత్తున చేపలను పెంచామని, అవి ఒక్కసారిగా బయటకు కొట్టుకుపోయాయని చేపల పెంపుదారుల సంఘం అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. దీనిపై తహసీల్దార్ లక్ష్మీనారాయణ, నీటిపారుదల శాఖ ఏఈ మహేష్‌కు ఫిర్యాదు చేశారు. ఏఈ, గిర్దావర్ రఘు చెరువు కట్ట వద్దకు చేరుకుని విచారించారు.



బూరెడ్డిపల్లి శివారులో తెంపిన చెరువుకట్ట



నీట మునిగిన వరి పంట

పంటకు నష్టం వాటిల్లింది



రెండు రోజుల్లో వరి పంటను కోత కోయాల్సి ఉంది. ఈ లోగా ఆకస్మికంగా పైభాగాన ఉన్న చెరువు కట్టను తెంపడంతో ఒక్కసారిగా నీళ్లు పొలంలోకి వచ్చాయి. వరి పంట నీటిలో మునిగిపోయింది. తమకు నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలి. తమకు నష్టపరిహారం చెల్లించాలి.

– రాజశేఖర్, రైతు, బూరెడ్డిపల్లి

చర్యలు తీసుకోండి



ప్రభుత్వానికి సంబంధించిన చెరువు కట్టను తెంపడం సరికాదు. కట్టను తెంపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రైతులకు తీరని నష్టం కలిగింది. చేతికందే దశలో పంటలు దెబ్బతిన్నాయి. దీనికి వెంచర్ నిర్వాహకులు బాధ్యత వహించి నష్టపరిహారం ఇవ్వాలి.

– శంకర్, రైతు, యాసాయకుంటతండా

గచ్చుబావికి పూర్వవైభవం వచ్చేనా?

300 ఏళ్ల కిందట రాతితో నిర్మాణం

- మెట్లబావి పక్కనే శివాలయం, ఈదమ్మ దేవాలయం
- ప్రస్తుతం ఆదరించేవారు లేక శిథిలావస్థకు..
- పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన యంత్రాంగం



కావేరమ్మపేటలో 300 ఏళ్ల నాటి గచ్చుబావి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని కావేరమ్మపేటలో 300 ఏళ్ల కిందట నిర్మించిన గచ్చుబావికి పూర్వవైభవానికి నోచుకోలేకపోతోంది. పట్టణానికి చెందిన పాలవాది సూగయ్యకు సంతానం లేకపోవడంతో సేవాకార్యక్రమాలు చేయాలని తలంచి ధర్మశాల దానికి అనుగుణంగా బావి నిర్మాణం చేశారు. రెండింటికి అనుబంధంగా రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. రాయి, గచ్చుతో బావిని నిర్మించడం వల్ల దానికి గచ్చుబావి పేరు వచ్చింది. ఈ క్రమంలో సూగయ్య మరణానంతరం తన సోదరుడు రంగయ్య కుటుంబీకులు శివాలయం, ధర్మశాల ఆలనాపాలనా చూస్తూ వచ్చారు.

డంపింగ్ యార్డుగా..

గచ్చుబావిని స్థానికులు డంపింగ్ యార్డుగా వినియోగిస్తున్నారు. చెత్తాచెదారం తీసుకువచ్చి అందులో పారవేస్తున్నారు. ముఖ్యంగా శుభకార్యాలు, అశుభకార్యాలకు వినియోగించే పూలు, పండ్లు, ఇతర ధాన్యాలు అన్నింటిని సంచుల్లో తీసుకువచ్చి ఇందులో వేస్తున్నారు. దీంతో నీరు కలుషితమై దుర్వాసన వస్తుంది. ఇటీవలే వార్డు కౌన్సిలర్ మహేష్ మున్సిపల్ సిబ్బందితో మెట్లను శుభ్రం చేయించారు. పెద్ద లైట్ ఏర్పాటు చేసి బావిలో చెత్త వేయరాదని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

గచ్చుతో నిర్మాణం

మెట్లబావిని రాయి, గచ్చుతో పటిష్టంగా నిర్మించారు. నాలుగు వైపులా నిర్మాణం చెక్కు చెదరకుండా ఉంది. ఒకవైపు మెట్లు నిర్మించి మూడు వైపులా గోడలు ఉంచారు. మెట్లవైపు కట్టడాలు సైతం నేటికీ చెక్కుచెదరలేదు. ఇటీవలే మెట్ల మార్గం, చుట్టూ చెత్తాచెదారం తొలగించడంతో సుందరంగా మారింది. మే నెలలో ఎండలు మండుతున్నప్పటికీ నీటి నిల్వ ఉండటం విశేషం. ఏ కాలంలోనైనా నీటి నిల్వ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అయితే నీటిని వినియోగించకపోవడం వల్ల దుర్వాసనతో మురికి కూపంగా మారింది.

బాటసారులకు విడిది

అప్పట్లో వివిధ ప్రాంతాలకు వచ్చి వెళ్లే బాటసారులకు సూగయ్య నిర్మించిన ధర్మశాల విడిదిగా మారింది. ధర్మశాలతోపాటు బావి ఉండటంతో వంటావార్పు చేసుకుని రాత్రిళ్లు బసచేసి మరుసటిరోజు ఉదయం వెళ్లేవారు. ఇలా కొన్నేళ్లపాటు ధర్మశాల, గచ్చుబావి బాటసారులకు విడిదిగా ఉండింది. కాలక్రమేణా రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో బాటసారులు లేక ధర్మశాల శిథిలావస్థకు చేరుకుంది. దీనికి ఆనుకుని ఉన్న గచ్చుబావి సైతం నిరుపయోగంగా మారింది. రంగయ్య 9వ తరానికి చెందినవాళ్లు ప్రస్తుతం ఆలయాలను పునరుద్ధరణ చేశారు. అయితే ధర్మశాల, బావిని చక్కదిద్దడం వారికి కష్టంగా మారింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పురాతన బావులకు పూర్వవైభవం తీసుకువస్తుండటంతో గచ్చుబావిని సైతం అలా మార్చాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మున్సిపల్ పాలకవర్గం, వార్డు కౌన్సిలర్, అధికారులు బావిని సందర్శించి రూ.40 లక్షలతో మరమ్మతు పనులకు ప్రతిపాదించారు. దేవాదాయశాఖకు ప్రతిపాదనలు పంపించేందుకు సిద్ధం చేశారు.



గచ్చుబావి సమీపంలో నిర్మించిన ధర్మశాల

మా వంశస్థులే నిర్మించారు



300 ఏళ్ల కిందట మా వంశస్థుడైన సూగయ్య ధర్మశాల, గచ్చుబావిని, సమీపంలో శివాలయం, ఈదమ్మ ఆలయాలు నిర్మించారు. 3 శతాబ్దాల కిందట నిర్మించినప్పటికీ నిర్మాణం ఎంతో పటిష్టంగా ఉంది. బావి శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులు చెత్త పడేస్తున్నారు. బావికి పూర్వవైభవం తీసుకువస్తే మా వంశస్థుల ఖ్యాతి భావితరాలకు తెలుస్తుంది.

– పాలవాది శ్రీనివాస్, గచ్చుబావి నిర్మాణ వంశస్థుడు

ఎమ్మెల్యే హామీ ఇచ్చారు..



గచ్చుబావికి పూర్వవైభవం తీసకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మున్సిపల్ పాలకవర్గం, కమిషనర్‌తో బావిని సందర్శించాం. బావికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు నిధుల కేటాయింపు కోసం ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బావికి అవసరమైన మరమ్మతు చేయించి కావేరమ్మపేటను పర్యాటక ప్రాంతంగా మారుస్తాం.

– మహేష్, 2వ వార్డు కౌన్సిలర్

ప్రత్యేక గుర్తింపు వస్తుంది..



గచ్చుబావితో కావేరమ్మపేట ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వస్తుంది. 300 ఏళ్ల కిందట మా వంశస్థులు దీనిని నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు దేవాలయాల నిర్మాణంలో ఆర్య వైశ్యులదే కీలకపాత్ర అని గచ్చుబావితో మరోమారు రుజువైంది. బావితోపాటు శివాలయం, ఈదమ్మ ఆలయాలు నాడు నిర్మించారు. బావికి పూర్వ వైభవం తీసుకువస్తే ప్రత్యేకత నెలకొంటుంది.

– పాతాది సారిక, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, జడ్చర్ల

పర్యాటకంగా అభివృద్ధి..



గచ్చుబావిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు దేవాదాయ శాఖ నుంచి నిధులు తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కృషిచేస్తున్నారు. రూ.40 లక్షలతో బావిని మరమ్మతు చేయించి లైటింగ్ ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దుతాం. తద్వారా ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావడంతోపాటు పురాతన కట్టడాలు భావితరాలకు అందించేందుకు మావంతు ప్రయత్నిస్తాం.

– లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, జడ్చర్ల

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేర్వేరుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..



సుధాకర్ (ఫైల్)

చారకొండ: మండల కేంద్రం సమీపంలోని కల్వకుర్తి– దేవరకొండ ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం, కారు ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా గుండ్లపల్లి మండలం శేషాయికుంటకు చెందిన వరికుప్పల సుధాకర్(35), సంపంగి శ్రీను కలిసి చారకొండ నుంచి కల్వకుర్తి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనకాల వచ్చిన కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధాకర్ తలకు తీవ్ర గాయం కాగా.. అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. శ్రీను స్వల్పగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కల్యాణ్‌రావు తెలిపారు.

కల్వర్టును ఢీకొని మరొకరు..

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లికి చెందిన మైపాల్(35) శుక్రవారం ద్విచక్రవాహనంపై మద్దూరులో బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని అయ్యవారిపల్లి సమీపంలో మలుపు దగ్గర ద్విచక్రవాహనం అదుపు తప్పి కల్వర్టు ఢీకొని కిందపడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మైపాల్‌కు భార్య, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తకోట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని పాలెం బ్రిడ్జి సమీపంలో గురువారం సాయంత్రం బైక్‌పై వెళ్తున్న ఆంజనేయులు(45)ను కంటైనర్ ఢీకొట్టింది. దీంతో ఆంజనేయులుకు తీవ్ర గాయాలు కాగా వనపర్తి ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియాకు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటనపై బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

రక్తపోటు, మధుమేహ పరీక్షలు తప్పనిసరి

- ఎన్‌సీడీ సలహాదారు స్వాగత్



గంగాపురంలో మందులు పరిశీలిస్తున్న స్వాగత్

జడ్చర్ల టౌన్: 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికి రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి మందులు అందించాలని ఎన్‌సీడీ సలహాదారు స్వాగత్ సూచించారు. శుక్రవారం మండలంలోని గంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క రోగికి సరిపడా మందులు నిల్వ చేయాలని పీహెచ్‌సీ వైద్యుడు డా.శివకాంత్‌కు సూచించారు. అనంతరం గోప్లాపూర్ సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. రోగుల రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా కో–ఆర్డినేటర్ డా.వ్యాస్ ఉన్నారు.

ఎంసీబీలో మంటలు.. వ్యక్తికి గాయాలు

- నెట్టెంపాడు ఎత్తిపోతల వద్ద ఘటన



గాయపడిన నవీన్

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతలలో భాగమైన ర్యాలంపాడు లిఫ్టు– 2 పంప్‌హౌస్ వద్ద ఎంసీబీలో మంటలు వ్యాపించి ఓ వ్యక్తికి తీవ్రగాయాలు కాగా.. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మార్లబీడుకు చెందిన నవీన్ ఎలక్ట్రీషియన్‌గా కొంతకాలంగా లిఫ్టు–2 పంప్‌హౌస్ వద్ద పనిచేస్తున్నాడు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) టెస్టులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డులను చెక్ చేస్తుండగా అకస్మాత్తుగా మంటలు వచ్చి నవీన్ ముఖం కాలి తీవ్ర గాయాలు కాగా.. మరో ఎలక్ట్రీషియన్ కార్మికుడు నాగప్ప స్వల్పగాయాలయ్యాయి. వెంటనే బాధితులను గద్వాల జిల్లా ఆస్పత్రికి, అనంతరం కర్నూలుకు తరలించినట్లు సైట్ ఇన్‌చార్జ్ నాగరాజు తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు చెప్పారన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.2,44,800 అపహరణ



బీరువాను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీహరి

ఖిల్లాఘనపురం: తాళం వేసి ఉన్న ఓ ఇంటిలో దొంగలు చొరబడి రూ.2,44,800 ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని అప్పారెడ్డిపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొత్తగొల్ల చెన్నయ్య ఇంటి దగ్గర ఉండి భార్య చంద్రకళ, కుమారుడు, కుమార్తెను గురువారం ఓ శుభకార్యానికి మరో ఊరికి పంపారు. రాత్రి 9.30 గంటల సమయంలో ఇంట్లో భోజనం చేసి గ్రామ సమీపంలో ఉన్న కోళ్ల ఫారం దగ్గరకు వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగ్గొట్టి లోనికి చొరబడి ఇనుప పెట్టెలో దాచిన రూ.2,44,800 నగదు, తులం బంగారు నగ ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం వచ్చిన చెన్నయ్యకు తాళం విరిగి కనిపించడంతో లోనికి వెళ్లి పెట్టెను పరిశీలించాడు. అందులో డబ్బులు కనిపించకపోవడంతో బోరున విలపించాడు. విషయం తెలుసుకున్న కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీహరి ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి వేలిముద్రలను సేకరించారు. బాధితుడు చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

అభంగాపూర్‌లో ఆశప్ప అంత్యక్రియలు

- ముందస్తుగా పోలీస్ బందోబస్తు

నారాయణపేట: మండలంలోని అభంగాపూర్‌కు చెందిన రియల్టర్ ఆశప్ప అలియాస్ అశోక్ అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. ఆశప్పను భూ తగదాలు, పాతకక్షల నేపథ్యంలో గురువారం రాత్రి హైదరాబాద్ శివారులోని నాగారం మున్సిపాలిటీ పరిధి ఆర్టీసీ టీపీఎస్ కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మల్కాజిగిరి డీసీపీ జానకి సూచన మేరకు నారాయణపేట ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఆదేశాలతో సీఐ రవిబాబు, ఎస్‌ఐ సురేశ్‌ల ఆధ్వర్యంలో అభంగాపూర్‌లో ముందస్తు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తుతో పర్యవేక్షించారు. హత్యకు గురైన ఆశప్ప మృతదేహానికి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అక్కడి పోలీసులు అప్పగించడంతో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఆ తర్వాత పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రియలు జరిపారు. పోలీస్ పికెటింగ్‌తో గ్రామమంతా నిశ్శబ్దంగా మారింది.



ఆశప్ప మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భర్త వేధింపులు భరించలేక.. కాల్వలో దూకి భార్య ఆత్మహత్య

పెద్దకొత్తపల్లి: మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ.. కట్టుకున్న భార్యను వేధించడంతో భరించలేక ఆమె కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం తిర్నాంపల్లికి చెందిన మహేస్, పార్వతమ్మ (30)కు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భర్త మహేష్ గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీనికి భార్య అడ్డు చెబుతుండడంతో ఆమెను వేధించసాగాడు. ఈ నెల 10వ తేదీ నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేక పార్వతమ్మ గురువారం రాత్రి పాలమూరు– రంగారెడ్డి కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం రైతులు మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ రాముకు సమాచారం ఇచ్చారు. పార్వతమ్మ తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..



తిరుపతయ్య (ఫైల్)

గోపాల్‌పేట: కుటుంబకలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో చోటు చేసుకుంది. తాడిపర్తికి చెందిన తిరుపతయ్య(56)కు వెంకటయ్య, ఇద్దరు కుమారులు శివకుమార్, భాను ఉన్నారు. కొంతకాలంగా ఇంట్లో చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. గురువారం సైతం చిన్నపాటి గొడవ జరగడంతో ఆయన మనస్తాపానికి గురయ్యాడు. రాత్రి తిని అందరూ పడుకున్న తర్వాత ఇంటివెనక వైపు తలుపునకు తిరుపతయ్య ఉరి వేసుకున్నాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో ఆయన కుమారుడు శివకుమార్ గమనించి వెంటనే ఆయనను వనపర్తి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పెద్దకుమారుడు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో బాలిక మృతి

- పెళ్లి కోసం వేసిన ఫ్లవర్ డెకరేషన్‌తో ప్రమాదం



జాహ్నవి (ఫైల్)

పెబ్బేరు: బంధువుల పెళ్లి కోసం వచ్చిన ఓ బాలిక ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. శుక్రవారం పెబ్బేరులో చోటుచేసుకున్న ఈ విషాదకర సంఘటనకు సంబంధించి వివరాలిలా.. గోపాల్‌పేట మండలం ఏదుట్లకు చెందిన రాధ, భాస్కరాచారి దంపతులు తమ కూతురు జాహ్నవి అలియాస్ శ్రీ(16)తో కలిసి పెబ్బేరులో తమ బంధువుల పెళ్లి కోసం వచ్చారు. ఈ క్రమంలో గురువారం రాత్రి పెళ్లి కోసం వేసిన ఫ్లవర్ డేకరేషన్‌తోపాటు విద్యుత్ లైట్లు వేశారు. అలాగే అక్కడక్కడ పెద్దలైట్లు బిగించడంతో అర్ధరాత్రి సమయంలో విద్యుత్ స్తంభం దగ్గర షార్ట్‌సర్క్యూట్ కావడంతో అక్కడే ఉన్న జాహ్నవికి విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందింది. జాహ్నవి ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఫస్ట్ ర్యాంకుతో పాసైందని బంధువులు తెలిపారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ జగదీశ్వర్ చెప్పారు. ఇదిలా ఉండగా బంధువులు బీచుపల్లి ఆలయంలో పెళ్లి తంతు జరిపించారు.

గుండెపోటుతో యువకుడు..



శ్రీను (ఫైల్)

వెల్దండ: మండలంలోని కొట్రకు చెందిన శ్యాంపూరి శ్రీను(38) గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందాడు. శుక్రవారం ఉదయం భోజనం చేసిన అనంతరం కుప్పకూలి పడ్డాడు. ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. శ్రీను గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేటీగా పనిచేస్తున్నాడు. శ్రీనుకు భార్య పద్మతోపాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

ఈతకు వెళ్లి వ్యక్తి..

కొత్తకోట: పెళ్లికి వచ్చిన ఓ యువకుడు గ్రామ సమీపంలోని బావికి ఈతకు వెళ్లి మృతిచెందిన ఘటన మండలంలోని మిరాసిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. పెబ్బేరు మండలం రాంపూర్‌కు చెందిన బీచుపల్లియాదవ్ (35) మిరాసిపల్లిలోని బంధువుల ఇంట్లో జరిగే వివాహానికి శుక్రవారం ఉదయం వచ్చారు. వేడుక ముగిసిన తర్వాత స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని బావికి ఈతకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోవడంతో గుర్తించిన స్నేహితులు బంధువులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి ఫైర్‌సిబ్బంది, బంధువులు చేరుకొని బావిలోకి దిగి బయటకు తీసి చూడగా అప్పటికే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బైక్ పైనుంచి పడి మహిళ..

చిన్నచింతకుంట: బైక్‌పై నుంచి జారిపడి ఓ మహిళ మృతిచెందిన సంఘటన చిన్నచింతకుంటలో చోటుచేసుకుంది. నారాయణపేట జిల్లా నర్వ మండలం జక్కన్నపల్లికి చెందిన వడ్డెర సంతోష(30) పదేళ్ల క్రితం కొత్తకోట మండలం కానాయపల్లికి చెందిన వడ్డెర రాజుకు ఇచ్చి వివాహం చేశారు. అయితే రాజు, సంతోష గురువారం చిన్నచింతకుంట మండలం మద్దూరులో బంధువుల పెళ్లికి వచ్చారు. కొత్త దుస్తులు కొనుగోలు చేసేందుకు బైక్‌పై చిన్నచింతకుటకు వచ్చి తిరిగి వెళ్తుండగా గ్రామ సమీపంలో బైక్‌పై నుంచి సంతోష జారి పడగా తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. సంతోష అన్న వడ్డె ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపారు.

మృతదేహం లభ్యం

పెద్దకొత్తపల్లి: చంద్రకల్, సంజీవాపూర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డు పక్కన గుంతలో 30 ఏళ్ల గుర్తు తెలియని యువకుడి మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ కుర్మయ్య తెలిపారు. తెలుపురంగు ప్యాంటు, గోధుమరంగు టీషర్ట్ ధరించి ఉన్నాడని.. మరిన్ని వివరాల కోసం కొల్లాపూర్ సీఐ (సెల్ ఫోన్ నంబర్ 87126 57721)ని సంప్రదించాలని సూచించారు.

కారు బోల్తా.. అయిదుగురికి గాయాలు

బిజినేపల్లి: కారు అదుపుతప్పి బోల్తాపడటంతో అందులోని అయిదుగురు గాయాలపాలైన మండలంలోని మహదేవునిపేట సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని మంగనూర్‌కు చెందిన కారులో అయిదుగురు గురువారం రాత్రి ఓ శుభకార్యానికి వెళ్లేందుకు బిజినేపల్లి నుంచి వనపర్తికి బయలుదేరారు. మహదేవునిపేట సమీపంలో మలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తాకొట్టింది. అటుగా వెళ్తున్న కొందరు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో కావలి గోవర్ధన్, నర్మద, చిన్నారులు అనిరుధ్, కేథన్, మహేశ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో చిన్నారి..

- కాపాడబోయిన అమ్మమ్మకు తీవ్రగాయాలు



షాలిని మృతదేహం

ఎర్రవల్లిచౌరస్తా: రేకుల షెడ్‌లో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ చిన్నారి మృతిచెందగా.. కాపాడబోయిన అమ్మమ్మకు తీవ్రగాయాలైన సంఘటన ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నెలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోకారి కథనం ప్రకారం.. పెద్దదిన్నెకు చెందిన రోజమ్మకు మల్దకల్‌కు చెందిన యాకోబుతో వివాహం జరిగింది. అనారోగ్యంతో బాధపడుతున్న రోజమ్మ తల్లి సంతోషమ్మ దగ్గరికి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇటీవల వచ్చింది. ఈ క్రమంలో వారు నివశిస్తున్న రేకుల గుడిసెలో ఫ్యాన్ విద్యుత్ వైరు పైపు సపోర్టుగా బిగించిన వైరుకు తగలడంతో విద్యుత్ సరఫరా అయింది. దీంతో చిన్నారి షాలిని అలియాస్ తిమ్ములమ్మ(5) ఆడుకుంటూ వైరును తగలడంతో షాక్‌కు గురై కేకలు వేసింది. గమనించిన అమ్మమ్మ సంతోషమ్మ చిన్నారిని కాపాడేందుకు వెళ్లగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఇద్దరికి సీపీఆర్ చేసి చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చిన్నారి షాలిని మృతిచెందింది. ఈ ఘటనపై తండ్రి యాకోబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే గ్రామంలో ఎర్త్ సమస్య కారణంగా ఇళ్లలో తరుచుగా విద్యుత్ షాక్ వస్తుందని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: వీధికుక్కల దాడిలో బాలుడు గాయపడిన ఘటన జిల్లాకేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథ నం మేరకు.. పట్టణంలోని ఎర్రగడ్డకాలనీకి చెందిన సిద్ధు పాల దుకాణం నుంచి ఇంటికి వెళ్తుండగా వీధికుక్కలు వెంబడించాయి. అక్కడే ఉన్న హరీశ్ అనే యువకుడు గమనించి కుక్కలను తరమడంతో ప్రాణాపాయం తప్పింది. గాయాల పాలైన బాలుడిని వెంటనే జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

మొక్కజొన్న పంట దగ్ధం



బిజినేపల్లి: మండలంలోని గుడ్లనర్వ శివారులో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని బద్యా అనే కౌలు రైతుకు చెందిన నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు నాగరాజు తన పొలంలోని మొక్కజొన్న చెత్తకు నిప్పు పెట్టాడు. ప్రమాదవశాత్తు ఆ నిప్పు కాస్త బద్యాకు చెందిన మొక్కజొన్న పంటకు వ్యాపించింది. దీంతో దాదాపు 4 ఎకరాల్లో పంట పూర్తిగా కాలిపోయింది. స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంతో రైతుకు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయాడు.

సేవ చేసే అవకాశమిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు

ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సోమేశ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుగా మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని ఆరో అంతస్తులో తనకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సచివాలయంలోని అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీ కొత్త నిబంధనలపై అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: పన్ను మినహాయింపు నిబంధనల్లో వచ్చిన మార్పులను పన్ను చెల్లింపుదారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు గమనించాలని న్యూఢిల్లీ చీఫ్ కమిషనర్ (మినహాయింపులు) రేణు జౌహ్రీ సూచించారు. ఆదాయపు పన్ను మినహాయింపులో కొత్త, సవరించిన నిబంధనలను వివరించడానికి, హైదరాబాద్ ఏసీగార్డ్స్‌లోని ఆదాయపు పన్ను టవర్స్‌లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణు జౌహ్రీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్నులో మినహాయింపు సెక్షన్లలో తెచ్చిన కొత్త నిబంధనలు, సవరణలను తెలిపారు. నాన్ ప్రాఫిటబుల్ ఆర్గనైజేషన్స్ (ఎన్‌పీఓ)ల నమోదులో ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం ప్రారంభమైందని, ఇప్పటికే ఉన్న ఎన్‌పీఓలు, కొత్త ఎన్‌పీఓలు ఏదైనా మినహాయింపును క్లెయిమ్ చేయడానికి కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం, నిర్దిష్ట ఉల్లంఘనలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. మినహాయింపును క్లెయిమ్ చేయడానికి, ఆదాయ రిటర్న్‌ను దాఖలు చేయడం తప్పనిసరని, అవసరమైన ఆడిట్ నివేదికలు, ఇతర నివేదికలను సమయానుకూలంగా సమర్పించాలని వెల్లడించారు. కార్యక్రమంలో జేసీఐటీ (మినహాయింపులు) వి.కోటేశ్వరమ్మ, డీసీఐటీ (మినహాయింపులు) సుధా కొరివి, డీసీఐటీ (మినహాయింపులు) ధృవాష్ట, ఆదాయపు పన్ను అధికారులు, పన్ను బార్ అసోసియేషన్ సభ్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

అధ్యాపకుడు మధుసూదన్ రెడ్డిని తొలగించండి

ప్రభుత్వానికి ఇంటర్ బోర్డ్ కార్యదర్శి సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: సస్పెండైన సరూర్‌నగర్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు పి.మధుసూదన్ రెడ్డిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వానికి ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ సిఫార్సు చేశారు. మధుసూదన్ రెడ్డిపై అవినీతితో పాటు, బాధ్యతారాహిత్యం, విధుల్లో క్రమశిక్షణ రాహిత్యం, ఉద్యోగులను బెదిరించడం, మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆయనను విధుల నుంచి తొలగించడం సరైన నిర్ణయమని ప్రభుత్వ కార్యదర్శికి పంపిన ఫైల్‌లో నవీన్ మిత్తల్ పేర్కొన్నారు.

ఐసీఐడీ వేదికలో భాగస్వామి కండి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ సాగులో నీటి ఎద్దడి నివారణ అనే థీమ్‌తో నవంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ ఇరిగేషన్, డ్రైనేజీ కమిషన్ (ఐసీఐడీ) అంతర్జాతీయ కాంగ్రెస్‌లో భాగస్వామి కావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఐసీఐడీ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఈఎన్‌సీ మురళీధర్‌ను కలిసి సమావేశం వివరాలను తెలిపారు. 57 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత భారతదేశానికి ఈ అవకాశం వచ్చిందని, విశాఖ వేదిక కానుందని పేర్కొన్నారు.

కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని భారతీయ జనతా యువమోర్చా డిమాండ్ చేసింది. ఫీజు రెగ్యులేటరీ కమిటీలను బలోపేతం చేసి ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం రూపొందించిన నివేదికతో ప్రైవేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్‌కు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ ఆధ్వర్యంలోని బృందం వినతి పత్రం సమర్పించింది.


కాలులేని భార్యను భుజంపై మోసుకొని..

వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్‌లేక రోగి అవస్థ • చికిత్సకు వచ్చి వెళ్లే క్రమంలో ఘటన • సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్ అందుబాటులో లేక ఓ వృద్ధుడు తన భార్యను చికిత్స అనంతరం భుజాలపై మోసుకెళ్లిన ఘటన శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. భద్రాది కొత్తగూడెం జిల్లాకు చెందిన మాలోతు లక్ష్మికి నవంబర్‌లో కుడికాలి రక్తప్రసరణ ఆగిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మోకాలు కింద నుంచి కాలును తొలగించారు. రోగిని 15 రోజులకోసారి డ్రెస్సింగ్ కోసం తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మిని ఆమె భర్త ఆస్పత్రికి తీసుకుచ్చాడు. అక్కడున్న సిబ్బంది 'పెద్ద సార్ లేరు.. రేపు రావాలని చెప్పారు. అయితే ఆ సమయంలో స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో భుజాలపై మోసుకుంటూ మండుతున్న ఎండలోనే బయటకు తీసుకెళ్లాడు. ఈ ఘటనపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్పందించారు. డ్రెస్సింగ్ అనంతరం పేషెంట్ కేర్ సిబ్బంది రోగిని వీల్‌చైర్‌లో క్యాజువాలిటీ నుంచి బయటకు తీసుకొచ్చారని తెలిపారు. కాలిపర్ (కాలుకు అమర్చే లోహ పరికరం) సేవల కోసం వెళ్లగా శనివారం అందుబాటులో ఉంటుందని, అప్పుడు రావాలని సిబ్బంది చెప్పారన్నారు. దీంతో తిరిగి వెళ్లే క్రమంలో ఎండ తీవ్రత దృష్ట్యా భర్త తన భార్యను ఒక చెట్టు వద్దకు తీసుకెళ్లేందుకు భుజంపై ఎక్కించుకొని వెళ్తుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఇలాంటి ఘటనలతో ఆస్పత్రిని అభాసుపాలు చేయవద్దని కోరారు.

టుడేస్ గ్రాఫిక్

మీకో విషయం తెలుసా? ప్రతి నాలుగు నిమిషాలకు ఈ భూమ్మీద వెయ్యి మంది పుడతారట. అయితే, ఆ వెయ్యి మందిలో ఏ దేశంలో ఎంత మంది జన్మిస్తారు? అల్రెడీ జనాభాలో నంబర్ వన్‌గా ఉన్న మనం.. ఈ విషయంలోనూ మొదటి స్థానంలోనే ఉన్నాం. వచ్చే నాలుగు నిమిషాల్లో ఆ వెయ్యిమందిలో 172 మంది భారత్‌లోనే పుడతారట. మరి మిగతా దేశాల సంగతేంటో.. ఓసారి చూద్దామా..



అడవులు కేంద్రంగా ఉగ్రవాద శిక్షణ

- ఆయుధాలు సమీకరించింది మహ్మద్ సలీం
- అక్కడి బృందానికీ ఇతడి ద్వారానే శిక్షణ
- ఈ ఐదుగురి నుంచి విదేశాలకు ఫోన్ కాల్స్

సాక్షి, హైదరాబాద్: నగరంతో పాటు భోపాల్‌లో పట్టుబడిన 16 మంది ఉగ్రవాదులు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లోనే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. నగర శివార్లలో ఉన్న వికారాబాద్‌లోని అనంతగిరి అడవుల మాదిరిగానే భోపాల్ సరిహద్దుల్లోని రైసెన్ అడవిని ఎంచుకున్నట్లు ఏటీఎస్ అధికారులు నిర్ధారించారు. అక్కడ అరెస్టయిన 11 మందితో పాటు నగరంలో చిక్కిన ఐదుగురినీ ప్రస్తుతం ఏటీఎస్ తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. –భోపాల్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సయ్యద్ డానిష్ అలీ ఇంటిలో సూత్రధారి యాసిర్ ఖాన్ నిర్వహించిన సమావేశాలకు నగరం నుంచి సలీంతో పాటు అబ్దుల్ రెహ్మాన్, షేక్ జునైద్ కూడా హాజరయ్యారని ఏటీఎస్ చెప్తోంది. దానికి సంబంధించిన ఆధారాలు సైతం తమకు లభించినట్లు స్పష్టం చేస్తోంది. గోల్కొండలోని సలీం నివాసంలో ఎయిర్ పిస్టల్, పిల్లెట్స్, భోపాల్‌లోని యాసిర్ ఇంటి నుంచి నాటు తుపాకీ, తూటాలు సీజ్ చేశారు. ఈ నాటు తుపాకీ సేకరించింది, భోపాల్ మాడ్యుల్‌కు శిక్షణ ఇచ్చింది కూడా సలీం అని ఏటీఎస్ అనుమానిస్తోంది. ఆ కోణంలో అతడిని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.



నగరంలో అరెస్టు చేసిన ఐదుగురినీ భోపాల్ కోర్టులో హాజరుపరుస్తున్న ఏటీఎస్

విదేశీ నంబర్లకు ఫోన్లపై ఆరా

నగర మాడ్యుల్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ఫోన్ల నుంచి విదేశీ నెంబర్లకు ఫోన్లు వెళ్లినట్లు అనుమానిస్తున్న దర్యాప్తు అధికారులు వాటి వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వీరికి విదేశాల్లో ఉన్న వారితో ఉన్న సంబంధాల పైనా దర్యాప్తు చేయనున్నారు. ఉగ్రవాద సాహిత్యాన్ని తన ల్యాప్‌టాప్ వినియోగించి సొంతంగా తయారు చేసిన సలీం అందులో అనేక అంశాలు చేర్చాడు. ఆన్‌లైన్‌లో ఉన్న విషయాలతో పాటు వివిధ పుస్తకాల్లోని అంశాలు క్రోడీకరించి రూపొందించిన ఇందులో జిహాద్, ముజాహిదీన్ అంటే ఏమిటి? తాము ఏం చేయాలి? అనే వివరాలతో పాటు ఉగ్రవాద చర్యల్లో పాల్గొంటూ చనిపోయిన వారి కుటుంబాలను ఎలా ఆదుకోవాలి? ఎలాంటి ఆయుధాలు సమీకరించుకోవాలి? క్యాడర్‌ను ఎలా రిక్రూట్ చేసుకోవాలి? తదితర వివరాలు పొందుపరిచాడు.

ఈ కేసులో సాక్షులుగా 'వారు'

సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరిని ఆకర్షించారు. వీళ్లు కేవలం మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నారని భావించిన వాళ్లు కొన్ని సమావేశాలకు హాజరయ్యారు. అయితే కొన్నాళ్లకే వీరి వ్యవహారశైలి, కార్యకలాపాలు అనుమానాస్పదంగా భావించిన వారంతా దూరయమ్యారు. వీరిని గుర్తించి, ఈ కేసులో సాక్షులుగా మార్చాలని పోలీసులు భావిస్తున్నారు.

ముగ్గురి ఇళ్లకు సీసీ కెమెరాలు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కిన ఐదుగురి ఉగ్రవాదుల్లో ముగ్గురి ఇళ్లకు బయట సీసీ కెమెరాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఏటీఎస్ అధికారులు, పోలీసులు దాడి చేయడానికి వచ్చారనే విషయం వీటిలో చూసి వాళ్లు గుర్తించారు. దీంతో ఉగ్రవాద సాహిత్యం దొరక్కుండా చేయడానికి ప్రయత్నాలు చేశారు.

ఈనెల 15 నుంచి సీఎం కప్

- పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడలు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకేనన్న శాట్స్ చైర్మన్

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్–2023 పేరిట ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో క్రీడా సంబరాలను నిర్వహించనుంది. ఈనెల 15 నుంచి 31వరకు వివిధ క్రీడా పోటీలు జరగనున్నాయి.15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సుగల పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించే క్రీడలు, వాటి నిర్వహణ, అందులో ఎవరెవరు ఉండాలనే అంశాలను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) విడుదల చేసింది.

నిర్వహించనున్న క్రీడలు.. : ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో మహిళలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు ఉంటాయి. పురుషులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, ఈత పోటీలు నిర్వహించనున్నారు. క్రీడల నిర్వహణకు మండల స్థాయికి రూ.15 వేలు, జిల్లా స్థాయికి రూ.75 ఇవ్వనున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికుల నుంచి నిధులను సమకూర్చుకోవచ్చు.

నగదు ప్రోత్సాహకాలు..

రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు అందజేస్తారు. వ్యక్తిగత క్రీడల్లో బహుమతిగా ప్రథమ–రూ.20 వేలు, ద్వితీయ–రూ.15 వేలు, తృతీయ–రూ.10 వేల నగదు అందజేయనున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలనూ అందజేస్తారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు.

బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా!

- తాళి కట్టేందుకు మొడికేసిన వరుడు
- బైక్‌కు డబ్బులిచ్చి.. పెళ్లికి ఒప్పించిన ఎమ్మెల్యే రసమయి
- కరీంనగర్ జిల్లాలో ఘటన



శంకరపట్నం(మానకొండూర్): పెళ్లికూతురు మెడలో తాళి కట్టే సమయానికి బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు మొండికేయడంతో అతిథిగా వెళ్లిన ఎమ్మెల్యే తానుబండి కొనిస్తా అని డబ్బులు ఇచ్చి వివాహంజరిపించిన ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్‌లో చోటుచేసుకుంది. శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ, మాజీ ఉపసర్పంచ్ మల్లయ్య కూతురు అనూష వివాహం సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సంఘాల వినయ్‌తో కుదిరింది. రూ.5 లక్షల కట్నంతో పాటు మోటార్ సైకిల్ కొనిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కట్నం డబ్బులు ముట్టచెప్పారు. మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పెళ్లి మండపానికి వధువు, వరుడి బంధువులు చేరుకున్నారు. కొత్తజంటను ఆశీర్వదించేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కూడా హాజరయ్యారు. తీరా.. తాళికట్టే సమయంలో మోటార్ సైకిల్ కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు వినయ్ మొండికేశాడు. దీంతో వరుడు, వధువు బంధువులు గొడవకు దిగడంతో ఎమ్మెల్యే రసమయి జోక్యం చేసుకుని పెళ్లి కొడుకు వినయ్‌తో మాట్లాడి మోటార్ సైకిల్ కొనుక్కోమని సొంత డబ్బులను (సుమారు రూ.50వేలు) అప్పటికప్పుడే పందిట్లోనే అందించారు. మిగతా సొమ్ము కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దగ్గరుండి వివాహం జరిపించి నూతన జంటను ఆశీర్వదించారు. తోడబుట్టిన అన్నగా పెళ్లి మండపంలో పరువు కాపాడావని మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ కన్నీరు పెట్టుకుంది.

న్యాయమూర్తి చొరవతో ఒక్కటైన జంట



నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాలతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించిన ఓ జంట న్యాయమూర్తి ఇచ్చిన కౌన్సిలింగ్‌తో తిరిగి ఒక్కటయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాములకు చెందిన అనూషకు రాముడుతో 2022, డిసెంబర్ 4న వివాహం జరిగింది. కుటుంబ కలహాలతో విడిపోవాలని నిర్ణయించుకొని జిల్లాకేంద్రంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థలో విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జి.సబిత మూడు వాయిదాల అనంతరం శుక్రవారం ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చి విడిపోదామనుకున్న జంటను ఒక్కటి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుటుంబంలో చిన్న చిన్న గొడవలు సహజమని, వాటిని ప్రేమతో సున్నితంగా ఎదుర్కొంటూ జీవిస్తే ఎలాంటి సమస్యలు ఉండవని సూచించారు. ప్రతి చిన్న విషయాన్ని పెద్దదిగా మార్చుకొని కోర్టులకు రావద్దని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ దేవిక, సిబ్బంది పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

వనపర్తి: ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి ఓ కిరాణం షాపులో 120 గ్రాముల గంజాయి పట్టుకున్న సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వనపర్తి ఎక్సైజ్ సీఐ సుభాష్ చందర్‌రావు కథనం ప్రకారం.. గురువారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గణపతిరెడ్డి టీం స్థానిక కేడీఆర్ నగర్‌లో తనిఖీలు నిర్వహించగా.. సందీప్‌గౌడ్ అనే యువకులు గంజాయి విక్రయిస్తుండగా పట్టుబడ్డాడు. హైదరాబాద్‌లోని దూల్‌పేట ప్రాంతం నుంచి గంజాయి ప్యాకెట్లను తీసుకువచ్చి వనపర్తిలో విక్రయిస్తున్నట్లు నిందితుడు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. కేసు నమోదు చేసి జడ్జి ఎదుట హాజరుపరినట్లు తెలిపారు.

33.71 టీఎంసీల నిల్వ

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం నీటిమట్టం 809.0 అడుగులు, 33.7180 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు నీటి విడుదల జరగలేదు. క్యాచ్‌మెంట్ వల్ల 1,853 క్యూసెక్కుల నీరు జలాశయంలో చేరాయి. 222 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

జేపీఎస్‌ల దీక్షకు సంపూర్ణ మద్దతు

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ధర్నాచౌక్‌లో సమ్మె శిబిరాన్ని ఆమె సందర్శించి వారికి పూర్తి మద్దతు తెలిపి మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం బెదిరింపులకు గురి చేయడం సరికాదని, ఉద్యోగ భద్రత లేక అభద్రతాభావంలో కార్యదర్శులు ఉన్నారని తెలిపారు. 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ల లీకేజీలో సీఎం కేసీఆర్ కుటుంబం పాత్ర ఉందని ఆరోపించారు. రెగ్యులర్ చేసేదాకా పంచాయతీ కార్యదర్శులు పోరాటం చేయాలని.. బీజేపీ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందన్నారు. జేపీఎస్, ఓపీఎస్‌ల కృషితోనే జాతీయస్థాయిలో అవార్డులు వచ్చాయని.. అందుకు ప్రభుత్వం వారికి ఇచ్చే బహుమతి ఇదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, ఎన్‌పీ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి లక్ష్మీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు పాండు, రవి, రఘుపతిరెడ్డి, నర్మద, శిరీష, రాఘవేందర్‌గౌడ్, హాజీ, వెంకట్రాములు, రాకేష్, వెంకటేశ్, మణి, సరస్వతి, శ్రీలత, కృష్ణ, వేణు, జ్ఞానేశ్వర్, సింధుజ, సంతోష్, శ్రీను, చెన్నకేశవులు, పూర్ణిమ, మణెమ్మ పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిలబడి నిరసన..

సమ్మెలో భాగంగా శుక్రవారం సమ్మె శిబిరంలో జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు ఒంటికాలిపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ.. విధుల్లో చేరకుంటే తొలగిస్తామని ప్రభుత్వం చేస్తున్న హెచ్చరికలకు లొంగేది లేదన్నారు.

పెళ్లిలో ప్లకార్డుల ప్రదర్శన



పెళ్లిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

జడ్చర్ల టౌన్: పట్టణంలో శుక్రవారం జరిగిన ఓ పెళ్లిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. గండేడ్ మండలం దేశాయిపల్లి జూనియర్ పంచాయతీ కార్యదర్శి సోదరి వివాహం జరిగింది. ఈ సందర్భంగా సమ్మెలో ఉన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే తమ సమస్యలు, డిమాండ్లు అయిన ఉద్యోగ భద్రత– ప్రభుత్వ బాధ్యత, వన్ నోటిఫికేషన్– వన్ రిజిస్ట్రేషన్, సాధిద్దాం.. సాధిద్దాం రెగ్యులరైజేషన్ సాధిద్దాం, భద్రతలేని నౌకరీ– ఎన్నాళ్లీ చాకిరి, నాలుగేళ్లు గడిచిపాయే– పర్మినెంట్ కాకపాయె అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పెళ్లికి హాజరైన వారంతా ప్లకార్డుల ప్రదర్శనతో ఒక్కసారిగా అవాక్కయినప్పటికీ వారి సమస్యలు తెలియడంతో డిమాండ్లు నెరవేరాలని ఆకాంక్షించారు.

'ఉన్నత లక్ష్యాలుంటేనే అత్యున్నత స్థాయి'





బాలాలతను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ గంగాధర్, కళాశాల సిబ్బంది

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కళాశాల స్థాయిలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుంటే జీవితంలో అత్యున్నతస్థాయికి ఎదుగుతారని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలాలత పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలలో శుక్రవారం ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ లక్ష్యం ఎంత పెద్దగా నిర్దేశించుకున్న జీవితంలో ఏదో ఒక సందర్భంలో దాన్ని చేరుకుని తీరుతామని, లక్ష్యాన్ని చేరుకోవడానికి కావాల్సిన మార్గాలను అన్వేషించాలని సూచించారు. డిగ్రీ పూర్తయిన తర్వాత ప్రతి విద్యార్థి కనీసం 15 గంటలకు ప్రతి రోజూ శ్రమించాల్సి ఉంటుందన్నారు. ఎంతోమంది కింది స్థాయిలో పనిచేసుకుంటున్న.. జీవితంలో ఉన్నతంగా ఎదిగిన వారు ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. పీయూ రిజిస్ట్రార్ గిరిజ మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి చదువులతో పాటు ఆట పాటలు వంటి వాటిని అలవాటు చేసుకోవాలని అప్పుడే వారు శారీరకంగా, మానసికంగా ఎదుగుతారని సూచించారు. ప్రతి ఒక్కరూ ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులు, కళాశాల పేరును నిలబెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీపీడీసీ మెంబర్ నాగేంద్రకుమార్, ప్రిన్సిపాల్ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో మౌంట్‌బాసిల్ విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రం సమీపంలోని తిరుమలహిల్స్ వద్ద ఉన్న మౌంట్‌బాసిల్ పాఠశాల విద్యార్థులు శుక్రవారం విడుదల చేసిన సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. పాఠశాల విద్యార్థులు పూల మణికాంత్ రాజు 475, ముజమ్మిల్ అలీ 473, సాయి వర్షిత్ 473 మార్కులు సాధించారు. వీరితో పాటు ఏ–1 గ్రేడ్ 88 మంది, ఏ–2 గ్రేడ్ 104, బీ–1 గ్రేడ్ 97 సాధించారు. ఈ మేరకు ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. 100 శాతం ఫలితాలు సాధించి జిల్లాలో మేటిగా నిలిచినట్లు పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకట్ పేర్కొన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో కరస్పాండెంట్ పూజితా మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు శిరీష ప్రవీణ్, సుశాంత్‌కృష్ణ, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

'స్వామి నారాయణ్' విద్యార్థుల ప్రతిభ



ప్రఫుల్‌యాదవ్



హర్షవర్ధన్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: సీబీఎస్ఈ పదవతరగతి ఫలితాల్లో జడ్చర్ల మండలంలోని నాగసాల స్వామినారాయణ్ గురుకుల అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. 100శాతం ఉత్తీర్ణతతో పాటు 40 మంది విద్యార్థులు డిస్టింక్షన్లు సాధించారు. 94 శాతం మార్కులతో ప్రఫుల్ యాదవ్ ప్రథమస్థానంలో నిలవగా.. 92శాతం మార్కులతో హర్షవర్ధన్‌రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులను పాఠశాల ప్రతినిధులు అక్షర భగత్‌జీ, కల్పేష్ భగత్‌జీ, డైరెక్టర్ భావిష్, ప్రిన్సిపాల్ అమరేందర్‌రెడ్డిలు అభినందించారు.

యువతి బలవన్మరణం

- పోస్టుమార్టం లేకుండానే ఖననం చేసిన కుటుంబ సభ్యులు
- ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫిర్యాదుతో తహసీల్దార్ సమక్షంలో పోస్టుమార్టం



యువతి మృతదేహాన్ని బయటకు తీయిస్తున్న పోలీసులు

గండేడ్: ఓ యువతి ఆత్మహత్య చేసుకోగా పోస్టుమార్టం చేయకుండానే కుటుంబసభ్యులు ఖననం చేయడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ సమక్షంలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య రెండో భార్య కుమార్తె సంధ్య (26) పదేళ్ల కిందట పెళ్లి చేసుకొని వెళ్లిపోయింది. నాలుగేళ్ల తర్వాత భర్త నుంచి విడిపోయి వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిపైన అద్దెకు ఉంటూ ఓ ప్రైవేట్ స్కూల్‌లో డాన్స్‌టీచర్‌గా పనిచేసేది. బుధవారం రాత్రి తను ఉండే గదిలో ఉరేసుకొని చనిపోయింది. విషయం తెలుసుకున్న కింద ఉన్న ఆస్పత్రి నిర్వాహకులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి హైదరాబాద్‌లో ఉన్న తండ్రి వెంకటయ్యకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన ఆస్పత్రి మార్చురీకి చేరుకొని తమకు ఎవరిపై అనుమానం లేదని చెప్పి మృతదేహాన్ని గండేడ్‌కు తీసుకొచ్చి గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలు పూర్తి చేశారు. మార్చురీలోని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించకుండానే కుటుంబ సభ్యులు తీసుకెళ్లారంటూ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రదీప్ గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం వికారాబాద్ నుంచి వైద్యులను తీసుకొచ్చి తహసీల్దార్ జ్యోతి సమక్షంలో పాతిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం యధావిధిగా పూడ్చిపెట్టారు.